క్లుప్తంగా

ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి ఉపాధ్యాయులు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు కోరారు. ఆమెకు మద్దతుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో చీపురుపల్లిలో బుధవారం ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో విజయగౌరి ఎంతో కాలంగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు దుప్పల భూపతి, మండల అధ్యక్షుడు నడిపేన బలరాం, గౌరవ అధక్షుడు మామిడి శ్రీను, మెరకముడిదాం మండల అధక్షుడు మజ్జి హరికృష్ణ, గరివిడి మండల ప్రధాన కార్యదర్శి కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఐటీడీఏ పరిధిలో చేర్చండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

శృంగవరపుకోట: అభివృద్ధికి నోచుకోకుండా దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నామని, తమ గ్రామాలను ఐటీడీఏ పరిధిలో చేర్చాలని మండల పరిధిలోని పలువురు గిరిజనులు సీపీఎం నేతృత్వంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ మండలంలోని గిరిజన గ్రామాలను ఐటీడీఏ పరిధిలో చేర్చి గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించాలని, జీవన ప్రమాణాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ అరుణకుమారికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు అర్జున్, సన్యాసిరావు, అరుణ్‌కుమార్, దారపర్తి సర్పంచ్ సన్యాసిరావు, గిరిజన నాయకులు జి.సత్యనారాయణ, జి.నాయుడు, ఎస్.రాము, జి.సన్యాసిరావు, జి.సాంబ, ఎం.నాగేశ్వరరావు, వి.శ్రీను, జి.రాధ, జి.చిలకమ్మ పాల్గొన్నారు.


లక్షబిల్వార్చన



ఉమాకోటిలింగేశ్వరస్వామికి బిల్వార్చన చేస్తున్న రుత్వికులు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో విశిష్ట శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరి క్షేత్రంలో ఉమాకోటిలింగేశ్వరస్వామికి మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా బుధవారం వేకువ జామున లక్ష బిల్వార్చన చేశారు. కార్యక్రమాన్ని దేవదాయ శాఖ నేతృత్వంలో పదకొండు మంది రుత్వికులు వేదోక్తంగా నిర్వహించారు.అనంతరం గర్భాలయం ఎదుట దేవాలయ ముఖ మండపంలో ఉదయం 10 గంటల సమయంలో కోటిలింగేశ్వరస్వామి, ఉమాదేవిల కల్యాణం వైభవంగా జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రకృతి సేద్యం విస్తరణకు కృషి



మాట్లాడుతున్న డీపీఎం ఆనందరావు

వేపాడ: ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామైఖ్య సంఘాలు సమన్వయంతో పని చేసి ప్రకృతి వ్యవసాయం విస్తరణకు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి(డీపీఎం) ఎం.ఆనందరావు కోరారు.స్థానిక వెలుగు సమాఖ్య భవ నంలో వీఓఏలకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం చేసేలా చూడాలని కోరారు. ప్రకృతి సేద్యం చేసేందుకు ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించాలన్నారు. ఏపీఎం సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెసర పంట కోత ప్రయోగం



పెసర పంట కోత ప్రయోగం చేస్తున్న ఏఓ స్వాతికుమారి, తదితరులు

లక్కవరపుకోట: మండల కేంద్రానికి చెందిన రైతు ఆల్తి సన్యాసి సాగు చేసిన పెసరపంటలో ఏఓ స్వాతికుమారి ఆధ్వర్యంలో బుధవారం పంటకోత ప్రయోగం చేశారు. 5 మీటర్ల పొడవు, వెడల్పు విస్తీర్ణంలో పంటను కోసి గింజలు తూకం వేసి దిగుబడి అంచనా వేశారు. ఏఓ మాట్లాడుతూ ఆశిం చిన స్థాయిలో దిగుబడులు రాలేదన్నారు .మండలంలో మొత్తం పది గ్రామాల్లో అపరాల పంట కోత ప్రయోగాలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు తొమ్మిది చోట్ల ప్రయోగాలు పూర్తి చేశామన్నారు. ఏఈఓ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

- అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో సేంద్రియ పద్ధతుల్లో ఆకుకూరలు, కూరగాయల సాగు
- పోషణ వాటిక పెరటితోటల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 వేల సహాయం
- మండలానికి ఓ అంగన్‌వాడీ కేంద్రం ఎంపిక
- పిల్లలకు ఆరోగ్యకర పంట ఉత్పత్తులతో పోషకాహారం అందించడమే లక్ష్యంగా నిర్వహణ



ఎస్. భూర్జవలస అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో గోరు చిక్కుడు కాయలను కోస్తున్న సిబ్బంది

అంగన్‌వాడీ వాకిట... పోషణ వాటిక



సాగులో ఉన్న వంగ పంట

దత్తిరాజేరు: పోషకాహార లోపం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూడడమే లక్ష్యంగా అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం సరఫరా చేస్తోంది. గ్రామాల్లోని అంగన్ వాడీలు తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ కేంద్రాలుగా సేవలందిస్తున్నాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ వాటిక' పథకం అమలు చేస్తోంది. కేంద్రాల్లోని పిల్లలకు సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలను ఆహారంగా అందించేందుకు కేంద్రాల ఆవరణలో పోషణ వాటిక పెరటి తోటల నిర్వహణకు తోడ్పాటు అందిస్తోంది. మండలానికి ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేసి పోషణ వాటిక పెరటి తోటల పెంపకానికి రూ.10 వేలు మంజూరు చేశారు. దత్తిరాజేరు మండలంలో ఈ పథకానికి అధికారులు ఎస్. భూర్జవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అను గుణంగా ఇక్కడి సిబ్బంది పోషణ వాటిక పెరటి తోటను సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కేంద్రం ఆవర ణలో ఉన్న కొద్ది స్థలాన్ని సద్వినియోగం చేసుకుని సేంద్రియ పద్ధతుల్లో తోటకూర, పాలకూర, కొత్తి మీర, చిక్కుడు, వంగ, బెండ,బీర, ముల్లంగి, టమాటా, మిరప పంటలను సాగు చేస్తున్నారు. కేంద్రానికి ప్రహరీ ఉండడంతో పశువులు, గొర్రెలు, మేక ల బెడద లేదని కూరగాయలు, ఆకుకూరలు బాగా పండుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ఈ కేంద్రంలో ఉన్న 11మంది పిల్లలకూ ఇక్క డ పండించిన కూరగాయలు, ఆకుకూరలతోనే రోజూ భోజనం అందిస్తున్నారు.

పెరటి తోట నిర్వహణ బాగుంది

పోషణ వాటిక పథకానికి ఎంపికైన ఎస్.భూర్జవలస అంగన్‌వాడీ కేంద్రంలో సేంద్రియ పద్ధతుల్లో అక్కడి సిబ్బంది కూరగాయలు, ఆకుకూ ర లు సాగు చేస్తున్నారు. ఇక్కడి పెరటి తోటల సాగు బాగుంది. ఈ కేంద్రాన్ని మిగతా కేంద్రాల సిబ్బంది ఆదర్శంగా తీసుకుని పోషణవాటిక పథకానికి ఎంపిక కాకపోయినప్పటికీ అవకాశం ఉన్నంతలో సిబ్బంది పెరటి తోటలను సాగు చేయడానికి ముందుకు రావాలి. పెరటి తోటల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– అపర్ణరాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్, దత్తిరాజేరు మండలం

తాజా కూరగాయలతో భోజనం

అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నాం. పిల్లలకు రోజూ తాజా కూరగాయలు, ఆకుకూరలతో భోజనం అందిస్తున్నాం. వంటకు అవసరం అయిన ఆకు కూరలు, కూరగాయలను ఏరోజుకారోజే పెరటిలో కోస్తున్నాం.

– ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్త, ఎస్.భూర్జవలస

ఎస్‌బీఐ ఈ-కార్నర్ సెంటర్ ఏర్పాటు చేయండి



ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసనాయుడు, తదితరులు

చీపురుపల్లి: నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లి పట్టణంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఈ-కార్నర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. ఈ మేరకు పలువురు వ్యాపారులు, ఖాతాదారులతో కలిసి స్థానిక ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవె న్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న చీపురుపల్లిలో వ్యాపార, వాణిజ్య సంస్థలు కూడా అధికంగా ఉన్నాయ న్నారు. దీంతో పాటు మూడు మండలాలకు చెందిన ఉద్యోగులు, పెన్షనర్ల ఖాతాలు, సాధారణ ఖాతాలతో స్టేట్‌బ్యాంక్ నిత్యం రద్దీగా ఉంటుందని, అందుకే ప్రజలకు బ్యాంకు సేవలు మరింత చేరువ,సులభం అవ్వాలంటే ఈ-కార్నర్ సెంటర్ అవసరమన్నారు. ఈ-కార్నర్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రజలు బ్యాంకుకు రాకుండా అక్కడే తమ పనులు ముగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈ-కార్నర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు గవిడి సురేష్, ఎల్.ప్రభాత్, లోకేష్, ప్రసాద్, నాగచైతన్య, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న బ్యాంకు లింకేజీ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్

చీపురుపల్లి: స్వయం సహాయక సంఘాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించినప్పుడే సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించగలరని బ్యాంకు లింకేజీ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ చెప్పారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మండలంలోని వీఓఏలతో బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘా లు పంచసూత్రాలు పాటించి ఆదర్శ సంఘాలుగా తయారయ్యేలా చూడాలని కోరారు. సంఘాలు అంతర్గత అప్పులు ఇప్పించడం ద్వారా సంఘ నిధిని పెంచుకోవచ్చన్నారు. బ్యాంకుల నుంచి ఇస్తున్న రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకుని తిరిగి వాయిదాలు చెల్లించే విధంగా వారికి అవగాహన కల్పించాలని సూచించారు బ్యాంకు పరపతి పెంచుకున్న సంఘాలకు బ్యాంకుల నుంచి పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. ఏపీడీ కె.సావిత్రి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ బి.బంగారమ్మ, ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.నాగమణి, సీసీలు పాల్గొన్నారు.

పాడిరైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు

- జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ వై.వి.రమణ



సోమలింగాపురంలో దేశీయ ఆవులను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ వై.వి.రమణ, తదితరులు

మెరకముడిదాం: అర్హులైన పాడిరైతులందరికీ పశుకిసాన్ క్రెడిట్ కార్డులను అందజేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి.రమణ పశువైద్యాధికారి సీహెచ్.హైమావతికి సూచించారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు.ఆస్పత్రిలో రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. 21వ పశుగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. అనంతరం వైద్యాధికారి హైమావతితో కలిసి సోమలింగాపురంలోని శ్రీవేంకటేశ్వర దేశీయ గోశాలను సందర్శించారు. పాడిరైతుతో మాట్లాడుతూగోశాలలో ఎన్ని ఆవులు ఉన్నాయి, రోజుకు ఎన్ని లీటర్ల పాలు ఇస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. 10 నుంచి 50 సెంట్ల విస్తీర్ణం వరకు పశుగ్రాస క్షేత్రాల నిర్వహణకు ఉపాధి హామీ పథకం నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేడీ సూచించారు. ఆయన వెంట సోమలింగాపురం ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, పశువైద్యశాఖ సిబ్బంది ఉన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు



అవగాహన కల్పిస్తున్న అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరునాయుడు

బొండపల్లి: రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించిందని, ఏ ఒక్కరూ వాటికి భంగం కలిగించకూడదని అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తల గౌరునాయుడు అన్నారు. రోళ్లవాక గ్రామంలో ఉన్న అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఒక వ్యక్తి తమ హక్కులకు భంగం కలిగిందని భావించినప్పుడు, అందుకు కారకులపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు తమని సంప్రదిస్తే తగిన సహాయం అందిస్తామన్నారు. చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగా హన కలిగి ఉండాలన్నారు.మానవ హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కమిషన్ కూడా ఉందన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో కొంత మంది అధికారులు,పాలకులు, నాయకుల వల్ల అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారికి పెద్ద కష్టం



బాలుడు కిరణ్‌కు ఆర్థిక సహాయం చేస్తున్న దాత అప్పలనాయుడు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన మండే రవి,సుజాత దంపతుల ఆరేళ్ల కుమారుడు కిరణ్ బోన్ క్యాన్సర్ వ్యాధి బారినపడ్డాడు. బాలుడు ప్రస్తు తం విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. క్యాన్సర్ సోకిన ఎముకను తొలగించి దాని స్థానంలో రాడ్ వేయాల్సి ఉంటుందని, ఇందుకోసం సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తల్లిదండ్రులకు చెప్పారు. పేదలమైన తాము అంత డబ్బులు ఎక్కడి నుంచి తీసుకువచ్చేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జాకేరు గ్రామానికి చెందిన బుద్దా అప్పలనాయుడు బుధవారం కేజీహెచ్‌కు వెళ్లి బాలుడి ఆపరేషన్ నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాలుడి ప్రాణాన్ని కాపాడేందుకు తనవంతు సాయం చేశానని, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని అప్పలనాయుడు కోరారు. సహాయం అందించాలనుకునే వారు 98663 94797 నంబర్‌ను సంప్రదించి ఆదుకోవాలని కోరుతున్నారు.

శింగరాయిలో 104 వైద్యశిబిరం

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామంలో వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధరణి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 56మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. హెల్త్ అసిస్టెంట్ పార్థసారథి , ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల నిరసన



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం కార్మికులు, సీఐటీయూ నాయకులు

శృంగవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జామి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద ఆ మండలంలోని మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో 6నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎండీఎం కార్మికులు వంటచేస్తున్నారని, ప్రభుత్వం మాత్రం 6నుంచి 8వ తరగతి విద్యార్థుల సంఖ్య ఆధారంగానే వేతనం ఇస్తోందని, 9,10వ తరగతుల విద్యార్థులకు వంట చేస్తున్నందుకు పూర్తిగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దోపిడీని అడ్డుకోవాల్సిన ప్రభుత్వాలే శ్రమ దోపిడీకి పాల్పడడం సిగ్గు చేటన్నారు. వెంటనే 9,10 తరగతుల పిల్లల వంటల నిర్వహణకు సంబంధించిన వేతనాలు విడుదల చేయాలని, కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పెట్టి అక్షయపాత్ర సంస్థకు సొమ్ములు చెల్లిస్తున్న సర్కారుకు స్కూళ్లలో వంట చేస్తున్న మహిళల ఇక్కట్లు కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. కార్మికులకు కనీస వేతనం రూ.10,000 చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట సరుకులు, వంట గ్యాస్ నేరుగా స్కూళ్లకు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఏకరూప దుస్తులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనం తరం ఎంఈఓ గంగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఎండీఎం కార్మికులు కొండమ్మ, విజయ, నాగమణి, అరుణ, సత్యవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొండపల్లి: మండలంలోని చామలాపల్లిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆ పథకం ఏపీఓ బి.కృష్ణవేణి బుధవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం రెండు పూటలా కలిపి ఆరుగంటలు పనిచేస్తే రోజుకు రూ.300ల గరిష్ట వేతనం వస్తుందని వేతనదారులకు వివరించారు. ఆమె వెంట ఈసీ ఆర్.సన్యాసిరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

తప్పు చేస్తే చర్యలు



చీపురుపల్లిరూరల్(గరివిడి): వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపాధి హామీ పనులకు రాని వారి పేరిట ఫీల్డ్ అసిస్టెంట్లు కానీ, మేట్లు కానీ మస్తర్లు వేయడం వంటి తప్పు చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గరివిడి మండలంలో ని కొండలక్ష్మీపురం గ్రామంలో చేపడుతున్న ఉపా ధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించా రు. వేతన దారులతో మాట్లాడుతూ రోజూ ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు పనులు చేయాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వెంట తాగునీరు తెచ్చుకోవాలని సూచించారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



పెనుబర్తి గ్రామంలో రామాలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణులకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తుమ్మ గుంటి పరమేష్, రెడ్డి అచ్యుతరావు, అంబల్ల చిన్నారావు, సంచాన సన్యాసినాయు డు, మండల అప్పలనాయుడు, గుషిడి సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు. – గుర్ల

ఉపాధ్యాయులకు సత్కారం



పెద్దబంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను డీపీఆర్టీయూ సేవాదల్ ఆధ్వర్యంలో ఆపాఠశాలలో బుధవారం సత్కరించారు. 2024లో పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అయిదుగురు విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించడంలో ఉపాధ్యా యులు చేసిన కృషిని అభినందిస్తూ వారిని సన్మానించామని డీపీఆర్టీయూ సేవాదల్ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను తెలిపారు. ఉపాధ్యాయులతో పాటు 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. డీపీఆర్టీయూ సేవాదల్ ప్రతినిధులు కంది వెంకటరమణ, శ్రీనివాసరావు, దామోదరరావు పాల్గొన్నారు. – గుర్ల

బినామీ మస్తర్లు వేస్తే చర్యలు



ఉపాధి హామీ పథకం పనులకు హాజరయ్యే వారి పేర్లే మస్తర్ల సీట్లలో ఉండాలని, పనులకు రాని వారికి, గ్రామాల్లో లేని వారి పేరుతో బినామీ,దొంగ మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్ హెచ్చరించారు. చీపురుపల్లి, అలజంగి పంచాయతీల్లో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు గరిష్ట వేతనం రూ.300 వస్తుందన్నారు. వేసవి కాలం ప్రారంభమైనందున ఉదయం వేగంగా పనులకు వచ్చి ఎండతీవ్రత పెరగక ముందే ముగించాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న వారే పనులకు హాజరు కావాలన్నారు. వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ ఆదిబాబు ఉన్నారు. – చీపురుపల్లి

సంక్షిప్తంగా...

నేత్రవైద్య శిబిరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): మానవీయత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామంలో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి గ్రామంతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి వచ్చిన 56 మందికి విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి చెందిన అప్తాలమిక్ కోమలి నేత్ర పరీక్షలు చేసి 29 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు, స్థానిక సర్పంచ్ కామేష్ ,తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌లపై దృష్టి

వేపాడ: పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటుపై మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు దృష్టి సారించాలని ఎంఈఓలు నాగభూషణం, బాల భాస్కరరావు సూచించారు.నల్లబిల్లి ప్రాథమి పాఠశాలను ఎంఈఓ నాగభూషణం,గుడివాడ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరా వు బుధవారం సందర్శించారు.విద్యార్థుల హాజరు రికార్డులు, వర్క్ బుక్స్ పరిశీలించారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి,నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసి వాటిని మధ్యాహ్న భోజన వంటల్లో వినియోగించాలని చెప్పారు.

ఆర్‌ఓబీ పనులు త్వరగా పూర్తి చేయాలి

చీపురుపల్లి: పట్టణంలోని రాజాం రోడ్‌లో అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఓబీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు ఇప్పిలి నీలకంఠం కోరారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలా కాలంగా ఆర్‌ఓబీ పనులు నిలిచిపో వడంతో చీపురుపల్లితో పాటు రాజాం, పాలకొండ తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే చీపురుపల్లి పట్టణంలోని రిక్షాకాలనీ వాసులకు సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే స్పందించి ఆర్‌ఓబీ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

గజపతినగరం: స్థానిక జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఎస్ఐ కె.లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. వాహన చోదకులను నిలిపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. పలువురు మద్యం తాగినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం నేరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించా లని సూచించారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలి

దత్తిరాజేరు: త్వరలో నిర్వహించనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీపీఆర్టీయూ సేవాదల్ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. 2024లో గడసాం ఉన్నత పాఠశాలకు చెందిన 61 మంది పదో తరగతి విద్యార్థుల్లో 21 మంది 500కు పైగా మార్కులు సాధించడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులను డీపీఆర్టీయూసేవాదల్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, డీపీఆర్టీయూ సేవాదల్ సభ్యులు పాల్గొన్నారు.

ఉల్లాస్ శిక్షణ తరగతుల పరిశీలన

లక్కవరపుకోట: మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉల్లాస్ శిక్షణ తరగతులను జిల్లా వయోజన విద్యా డీడీ ఏ.సోమేశ్వరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు బాధ్యత తీసుకుని వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వయోజన విద్య ఏపీఓ లక్ష్మి, ఎంఎల్ఓ హరీష్, ఏపీఎం గీత,వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.